క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. కార్పొరేషన్ పరిధి నవులూరు, బాపూజీనగర్, ఉడా కాలనీ, దళిత శిబిరం ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు రజక, పద్మశాలి కమ్యూనిటీ హాల్స్ ప్రారంభం

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి రాజీవ్ గృహకల్ప వద్ద సుమారు రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన రజక, పద్మశాలి కమ్యూనిటీ హాల్స్ శనివారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. గత రెండు నెలలుగా ఈ రెండు కమ్యూనిటీ హాల్స్ తుదిదశ నిర్మాణ పనులు నిలిచిపోగా ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులు రూ.5లక్షలను పట్టణ వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా ఇటీవల అందజేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు.

మూలాంకురేశ్వరికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి అమ్మవారికి మాఘ బహుళ శుక్రవారం పురస్కరించుకొని అర్చకులు అయ్యన్నశాస్త్రి విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ముఖ మండపంలో శ్రీచక్రానికి ఖడ్గమాల పూజలు, కుంకుమార్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైద్యశాలలో వృద్ధుడికి పింఛను అందజేత



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన షేక్ పటాలపు మౌలాలి గుండె సంబంధిత వ్యాధితో గుంటూరులోని లలిత సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. కాగా ఒకటో తేదీ వైఎస్సార్ పింఛన్ కానుక రావడంతో విషయం తెలుసుకున్న ఎనిమిదో వార్డు వలంటీర్ దారా మల్లేశ్వరరావు గుంటూరులోని వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేశాడు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మంగళగిరి: నగరానికి చెందిన ఓ వివాహిత మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. అత్తోట గ్రామానికి చెందిన కాకర్ల లక్ష్మీ నాగజ్యోతి(29) మంగళగిరి నగరంలోని పార్కు రోడ్డుకు చెందిన కాకర్ల బాజి తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కొంతకాలంగా కుటుంబ కలహాలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీ నాగజ్యోతి తన నివాసంలో శుక్రవారం ఉరి వేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతురాలి బంధువులు భర్త బాజినే హత్య చేసినట్లు ఆరోపిస్తూ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. పోలీసుల హామీతో విరమించారు.

రైతు కూలీలకు పింఛన్ పెంపు ఘనత వైఎస్ జగన్‌దే

ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త మేకతోటి సుచరిత



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేకతోటి సుచరిత, లబ్ధిదారులు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో కష్టాల్లో ఉన్న రైతు కూలీలకు పింఛన్ పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత పేర్కొన్నారు. పింఛన్ పెంపుతో తుళ్లూరులో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి హాజరైన సుచరిత మాట్లాడుతూ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లిన 14 రోజుల్లో సమస్య పరిష్కరించే దిశగా జీఓ జారీ చేసి రైతు కూలీల జీవితాల్లో ఆనందం నింపారని చెప్పారు. ఫిరంగిపురం సభలో రైతుకూలీలకు రూ.2500 నుంచి రూ.5000 పింఛన్ పెంచాలని కోరినట్లు వివరించారు. ఆ రోజు సభలో ఇచ్చిన మాట మేరకు మార్చి ఒకటో తేదీనే లబ్ధిదారులకు పెంచిన పింఛన్ అందించడం హర్షణీయమని చెప్పారు. రైతు కూలీలు ఈ చిన్న కోరిక కేవలం ఈ మండలానికి చెందిన 8,944 మందికి లబ్ధి చేకూరుతుండగా తుళ్లూరు ప్రాంతానికే కాకుండా మంగళగిరి ప్రాంతానికి 9,171 మందికి కూడా లబ్ధి చేకూరినట్లు వివరించారు. రెండు మండలాల్లోని పేదలకు ప్రతి నెల రూ.8.69 కోట్లు సంక్షేమం అందుతుందంటే జగనన్నకు పేదలపై ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. తనను ఈ నియోజకవర్గానికి పంపించినపుడు ఫిరంగిపురం స్థానికంగా అయినప్పటికీ తుళ్ళూరు మండలంలో ఇబ్బందికరమైన వాతావరణం ఉందని పలువురు చెప్పినప్పుడు నేను సమస్య ఎక్కడుందో అక్కడ ఉండాలనుకుంటానన్నారు. ఆ సమస్యను నేను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి అండదండతో సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో పింఛన్ అందాలంటే పంచాయతీ కార్యాలయాల వద్ద 3-4 రోజులు బారులు తీరాల్సిన పరిస్థితి ఉండేదని కానీ నేడు సూర్యుడు ఉదయించే లోగానే వలంటీర్ ఇంటి తలుపు తట్టి పింఛన్ చేతిలో పెట్టి వెళుతున్నాడంటే జగనన్న చేస్తున్న మంచి పాలనకు నిదర్శనమని చెప్పారు. అన్ని సమస్యలను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్న దృష్టికి తీసుకెళ్ళి కచ్చితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రాజధాని ప్రాంతంలో 54 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలిస్తే పేదలు ఈ ప్రాంతంలో నివసిస్తే డెమోగ్రాఫికల్ ఇన్ బ్యాలెన్స్ (సామాజిక అసమతుల్యత) వచ్చి ఈ ప్రాంత విలువ పడిపోతందని వివక్షగా తప్పుడు కేసులు వేయించడం సిగ్గుచేటన్నారు. రాజధాని ప్రాంతంలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను తప్పక పరిష్కరించి ముందుకెళతానన్నారు. అనంతరం ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలసి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. లబ్ధిదారులకు పెంచిన రూ.5,000 పింఛన్‌ను అందజేశారు. ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, సొసైటీ చైర్మన్‌లు మున్నంగి కోటిరెడ్డి, నాయుడు నాగేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, వివిధ విభాగాల నాయకులు శృంగారపాటి సందీప్, చలివేంద్రం సురేష్, తుమ్మూరు రమణారెడ్డి, కొమ్మినేని దత్తు, ఆరేపల్లి జోజి, దానం వినోద్, ఆంద్రేయప్ప, జొన్నకూటి ప్రశాంత్, షేక్ జానీ, పుట్టి సుబ్బారావు, బెజ్జం రాంబాబు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దుగ్గిరాల ప్రభుత్వ వైద్యుడు అబ్దుల్ రహమాన్

తాడేపల్లిరూరల్: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రహమాన్ అన్నారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్‌పోలియోపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 3వ తేదీన 0–5 ఏళ్ల లోపు పిల్లలు కలిగిన తల్లిదండ్రులు తమ చిన్నారులకు తప్పని సరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఆరోగ్యకేంద్ర పరిధిలో 0–5 ఏళ్లు కలిగిన చిన్నారులు 2,294 మంది ఉన్నారని, వారికి పోలియో చుక్కలు వేయడానికి మొత్తం 13 పోలియో కేంద్రాలు, ఒక ట్రాన్సిట్ యూనిట్, ఒక మొబైల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మార్చి 3వ తేదీన పోలియో కేంద్రాల్లో పోలియో చుక్కలు అందజేస్తారని, ఎవరైనా అనివార్య కారణాల వలన పోలియో చుక్కలు పోయించకపోతే, 4,5 తేదీల్లో అనగా సోమ, మంగళవారాల్లో ఇంటింటి సర్వే చేసి పోలియో చుక్కలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కె. శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వైద్యాధికారులు ఇందిర, సుకన్య పాల్గొన్నారు.

నిర్మల కళాశాలలో ప్రాంగణ ఎంపికలు పూర్తి



ప్రాంగణ ఎంపికలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో నిర్మల ఫార్మసీ కళాశాల యాజమాన్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులోని నిర్మలా ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు శుక్రవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవనం పాముల రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఔషధ తయారీ సంస్థ దివిస్ లేబొరేటరీస్ తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వివిధ కళాశాలలు చెందిన 150 మంది విద్యార్థులకు హాజరయ్యారని, పరీక్షల అనంతరం 60 మంది ఎంపిక అయ్యారని, వారిలో తమ కళాశాల నుంచి బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ విద్యార్థులు 35 మంది ఎంపిక కావడంతో ఆనందించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా ప్రాంగణ ఎంపికలో ఉత్తీర్ణులైన వారికి కళాశాల సెక్రటరీ సిస్టర్ జి. నిర్మలజ్యోతి అభినందించారు. కార్యక్రమంలో దివిస్ కంపెనీ మానవ వనరుల విభాగ అధికారి కె.రామకృష్ణ చౌదరి, కళాశాల ఉపాధి కల్పన విభాగం అధికారి ఎస్.కామేశ్వరరావు, సమన్వయకర్తలు డాక్టర్ ఎం.సుధీర్, వి.జోజిబాబు, సాంకేతిక సిబ్బంది బి.విజయ్‌కుమార్, వి.శ్రీహరి, వై.శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు బసవరావు
- ఇడుపులపాయ నుంచి చేపట్టిన పాదయాత్ర తాడేపల్లి చేరిక



మాట్లాడుతున్న బసవరావు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టిపోగు బసవరావు అన్నారు. శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర తాడేపల్లికి చేరింది. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పేదల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందన్నారు. నవరత్నాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండినట్లు చెప్పారు. పాదయాత్రకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర ఎస్సీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరు కనకారావు, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు, ఎంటీఎంసీ నగర అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎండీ గోరేబాబు, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, తాడేపల్లి పట్టణ ఎస్సీ విభాగం అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, ఎస్టీ, బీసీ సెల్ అధ్యక్షులు బాలసాని అనిల్, బత్తుల దాసు, సేవాదళ్ అధ్యక్షులు కురుబూర రమేష్, పార్టీ నాయకులు మేకా అంజిరెడ్డి, ఉంద్రు కళ్యాణ్, రొట్టె ఎలీషా, కొరకంటి ఉదయరాజు, భూపతి కిషోర్, బొందలపాటి శ్యామ్, పప్పీ వికాస్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాము ఉన్నారు.

ప్రాక్టికల్స్, నూతన సబ్జెక్టుల రూపకల్పనలో భాగస్వామ్యం



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

మోతడక(తాడికొండ): విద్యార్థులు తరగతి గదిలో చదివే పాఠ్యాంశాలతో పాటు ప్రాక్టికల్స్, నూతన ప్రాజెక్టుల రూపకల్పనలో భాగస్వామ్యం కావాలని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కరస్పాండెంట్ వైవీ సుజిత్ కుమార్ సూచించారు. మోతడక చలపతి కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ మరియు అలైట్ విభాగాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 29 నుంచి నిర్వహిస్తున్న సదస్సు శుక్రవారం ముగిసింది. ఐసీఆర్‌సీఈటీ– 22కే 24 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆన్‌లైన్ ద్వారా పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విశిష్ట అతిథిగా పాల్గొన్న అమెరికాకు చెందిన బీపీ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జి.వెంకట రామయ్య మాట్లాడుతూ కంప్యూటర్ టెక్నాలజీ మేధపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని వెలికితీసేందుకు సాంకేతిక సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. వీటిని ఉపయోగించుకొని విద్యార్థులు సాంకేతిక రంగం, ప్రాజెక్టుల రూపకల్పనలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.నాగ శ్రీనివాసరావు, కన్వీనర్ సైబర్ సెక్యూరిటీ విభాగాధినేత డాక్టర్ డి.కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

పసుపు రైతులకు న్యాయం చేయాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



రిలే నిరాహార దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలో జనవరి 19న శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో పంటను భద్రపరుచుకున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలేనిరాహార దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతుల డిమాండ్లకు పూర్తిగా తన మద్దతు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ధరల స్థిరీకరణ నిధి నుంచి లేదా ప్రకృతి విపత్తుల సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పసుపు రైతుల రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ మాట్లాడుతూ ప్రస్తుత పసుపు మార్కెట్ ధర క్వింటాకు 13 వేల రూపాయలు ఉందని, ఆ ధరను రైతులకు చెల్లించాలని కోరారు. ప్రమాదం జరిగి 38 రోజులు అవుతున్నా రైతులకు నష్ట పరిహారం అందలేదని అన్నారు. కోల్డ్ స్టోరేజ్ వారి లెక్కల ప్రకారం 381 మంది రైతులకు సంబంధించి 1,04,260 బస్తాలు ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ప్రకటన చేయకపోతే మంగళగిరి తెనాలి జాతీయ రహదారులను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య, దుగ్గిరాల మండల రైతుసంఘం కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు అమ్మిరెడ్డి, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, కాజా వెంకటేశ్వరరావు, లిబరేషన్ పార్టీ నాయకులు ఎల్.భాస్కరరావు, కె.అజయ్ కుమార్, వై.వెంకటేశ్వరరావు, ఎం.శివసాంబిరెడ్డి, వి.వెంకటరామయ్య, ఎ.వెంకట అప్పారెడ్డి, భారతి, పసుపు రైతులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగడిగుంట కోటిరెడ్డి వారివీధికి చెందిన శోభి స్నేహలత (25)కు 2022లో వసంతరాయపురానికి చెందిన లాజరస్‌తో వివాహమైంది. నాటి నుంచి లాజరస్, అతని కుటుంబ సభ్యులు స్నేహలతను నిత్యం వేధింపులకు గురిచేసేవారు. దీంతో సంగడిగుంట ప్రాంతానికి కాపురాన్ని మార్చారు. అయినప్పటికీ నిత్యం డబ్బుల కోసం వేధింపులకు గురి చేస్తుండేవాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భర్త వేధింపులు భరించలేక శుక్రవారం మధ్యాహ్నం స్నేహలత ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి గూడవల్లి ఏసు మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాడికొండ ఎస్ఐగా రవీంద్ర బాబు



తాడికొండ: తాడికొండకు నూతన ఎస్ఐగా దాసరి రవీంద్రబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్‌లో ఉన్న ఎస్ఐను తాడికొండకు ఆటాచ్‌మెంట్ చేస్తూ జిల్లా ఎస్పీ గురువారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. మరో ఎస్ఐగా నగరంపాలెంలో విధులు నిర్వహిస్తున్న జి.అంజయ్యను కేటాయించగా ఆయన నేడు లేదా రేపు విధులలో చేరే అవకాశం ఉంది.

వివాహానికి ఎమ్మెల్యే ఆర్కే సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులో జీవిస్తున్న పేద యువతి వివాహానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సహాయాన్ని పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ సుభాని, షాహిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. రోజువారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సుభాని మూడో కుమార్తె నస్రిన్ వివాహం ఈనెల మూడో తేదీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రూ.20 వేల సాయాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శృంగారపాటి రత్నం అందించారు.

నూతక్కిలో..

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నూతక్కి ఎస్సీ కాలనీకి చెందిన తుమ్మపూడి రమేష్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నూతక్కిలో గురువారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన ఎమ్మెల్యే ఆర్కే రమేష్ అనారోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం బాధితుడు రమేష్‌కు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా ఆర్థికసాయాన్ని అందజేశారు.

ఆలయానికి విరాళం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రులోని తిరుపతమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రకటించిన 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం భారీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల ఎస్.రత్నం, ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డం శంకర్, సంసోనమ్మ, నూతక్కి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రబీ పంట నమోదు ప్రక్రియ పూర్తి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి మండలంలో రబీ 2023–24 రబీ సీజన్‌కు గాను 2,263 ఎకరాలలో సాగు కాబడిన అన్ని రకాల పంటల ఈ క్రాప్ నమోదు పూర్తయిందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించబడతాయని, అదేవిధంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి వివరాలు చదివి వినిపించడం జరుగుతుందని, రైతులు రబీ 2023–24 పంట నమోదు ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందికి మీ అభ్యంతరాలను వ్రాతపూర్వకంగా అందజేయాలని, ఈనెల 3వ తేదీ చివరి రోజు అని, కావున రైతులు ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు ఆ ప్రకటనలో కోరారు.

జిల్లా స్థాయి జాతీయ సైన్స్ పోటీలలో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం పద్మావతి, సైన్స్ ఉపాధ్యాయులు శివ శంకర్ రావు

కంతేరు(తాడికొండ): జిల్లా స్థాయిలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించడం సంతోషంగా ఉందని కంతేరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పద్మావతి అన్నారు. శుక్రవారం క్విజ్‌లో బహుమతి సాధించిన విద్యార్థులతో పాటు సైన్స్ ఉపాధ్యాయుడు డి శివ శంకరరావును ఆమె అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి రాష్ట్ర స్థాయిలో పాఠశాల పేరును ఇనుమడింపజేయాలని సూచించారు.

అక్రమ గ్యాస్ సిలెండర్ల గుట్టురట్టు



సిలెండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సిబ్బంది

నగరంపాలెం: అక్రమ గ్యాస్ సిలెండర్లను విక్రయిస్తున్న ముగ్గురిపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. వారి నుంచి 56 సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కార్తికేయ హోటల్ వెనుక అక్రమంగా గ్యాస్ సిలెండర్లు నిల్వ చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నిందితుల్లో ఒకరు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన పాదర్తి కుమార్‌రాజాగా గుర్తించారు. అతను సబ్సిడీ సిలెండర్లలోని గ్యాస్‌ను వ్యాపార అవసరాలకు వాడే సిలెండర్లల్లోకి ఎక్కించేవాడు. అనంతరం వాటిని పులుగు రామకృష్ణ సాయంతో గుంటూరు బస్టాండ్ వద్దకు తరలించేవాడు. సిలెండర్లను చిచ్చుల సుబ్బారావు (ఋషి వ్యాలీ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్) సహకారంతో అవసరమైన హోటల్స్ నిర్వాహకులకు రూ.1,600 నుంచి రూ.1,650కు విక్రయించి, సొమ్ము చేసుకునేవారు. నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం గ్యాస్‌తో ఉన్న 24 సిలెండర్లు, 32 ఖాళీ సిలెండర్లను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కుమార్‌రాజాతోపాటు రామకృష్ణ, సుబ్బారావుపై 6ఏ కేసు నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్‌ను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసులురెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలకం

ఏఎన్‌యూ: దేశాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర ఎంతో కీలకమని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'నెట్‌వర్కింగ్ అండ్ ఇంటర్‌ఫేసింగ్ ఆఫ్ నాన్– గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జెన్స్ ఇన్ సోషల్ ఏక్షన్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం యూనివర్సిటీలో ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ సోషియాలజీ, సోషల్ వర్క్ విద్యార్థులు, పరిశోధకులు ప్రజలకు సేవ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి దానినే కెరీర్ గా ఎంచుకోవాలని సూచించారు.తమిళనాడు కోయంబత్తూర్ భారతీయార్ వర్సిటీకి చెందిన ఆచార్య సి. వెంకటాచలం కీలకోపన్యాసం చేస్తూ ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేసిన కోవిడ్ మహమ్మారిని తరిమికొట్టడంలో , వృద్ధులు, స్త్రీ శిశు సంక్షేమం, మహిళా సాధికారత, భద్రతలో ఎన్జీవోలు అందిస్తున్న కృషి ఘనమైనదని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ అసిస్టెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ. కుమార రాజా, సదస్సు డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.